నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 బుధవారం 16 ఏప్రిల్ 2025 MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD



వాల్ పోస్టర్లను విడుదల చేస్తున్న బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, బీఆర్ఎస్ నాయకులు

# మళ్లీ బీఆర్ఎస్‌దే అధికారం

- మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య
- రజతోత్సవ సభ వాల్ పోస్టర్ల విడుదల

నెన్నెల, ఏప్రిల్ 15 : అతి తక్కువ కాలంలోనే కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని, రాష్ట్రంలో మళ్లీ అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్ పార్టీయేనని బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య పేర్కొన్నారు. మంగళవారం నెన్నెలలో మండల ముఖ్య నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. రజతోత్సవ సభ వాల్ పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ నెల 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో రజతోత్సవ సభ నిర్వహణకు ఏర్పాట్లు చేస్తుండగా, అప్పుడే బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు వణుకుపుడుతున్నదన్నారు. బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సాగర్ గౌడ్, నాయకులు రాంచందర్, భీమాగౌడ్, తిరుపతి, ఇబ్రహీం, శంకర్, మల్లేశ, మల్లయ్య, మొండన్న, మేకల మల్లేశ్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

# 40 నిమిషాల్లోనే దొంగ పట్టివేత

- రూ. 36 వేలు స్వాధీనం
- చాకచక్యంగా వ్యవహరించిన సిబ్బందిని అభినందించిన ఎస్పీ, ఏఎస్పీ, సీఐ

ఆసిఫాబాద్ టౌన్, ఏప్రిల్ 15 : స్కూటీ డిక్కీ నుంచి నగదు దొంగిలించిన వ్యక్తిని కేవలం 40 నిమిషాల్లోనే పోలీసులు పట్టుకొని శభాష్ అనిపించుకున్నారు. ఆసిఫాబాద్ సీఐ రవీందర్ కథనం ప్రకారం.. జిల్లా కేంద్రానికి చెందిన మీర్‌అలీ గాంధీ చౌక్ వద్ద స్కూటీ పార్కింగ్ చేశాడు. ఓ దొంగ స్కూటీ డిక్కీలో ఉన్న రూ. 36 వేలు ఎత్తుకొని పారిపోయాడు. వెంటనే బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా సీఐ ఆధ్వర్యంలో బ్లూకోల్ట్స్ సిబ్బంది తిరుపతి, సాగర్ చోరీ జరిగిన ప్రదేశాన్ని సందర్శించారు. ఆ ప్రాంతంలోని సీసీ కెమెరాల ఆధారంగా దొంగను గుర్తించి పట్టుకున్నారు. రూ. 36 వేలు స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దొంగను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన సిబ్బందిని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు, ఏఎస్పీ చిత్తరంజన్, సీఐ రవీందర్, ఎస్ఐ అంజయ్య అభినందించారు.




బ్లూకోల్ట్స్ సిబ్బంది తిరుపతి, సాగర్‌ను అభినందిస్తున్న సీఐ రవీందర్

# ‘హస్తం’లో మంత్రి పదవి చిచ్చు..!

## తనకు అన్యాయం చేస్తే సహించేది లేదన్న పీఎస్సార్

- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆహ్వానిస్తేనే కాంగ్రెస్‌లోకి వచ్చానన్న వివేక్
- అధిష్ఠానమే నిర్ణయిస్తుంది.. సీనియర్‌గా మంత్రి పదవి అడగడంలో తప్పేంటన్న వినోద్
- మినిస్టర్ పదవి కోసం ఎవరికి వారే పోటాపోటీ
- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్‌లో కాకరేపుతోన్న తాజా పరిణామాలు
- అనుయాయులకు పదవి కోసం మూడుగా చీలిపోయిన రాష్ట్ర మంత్రులు..?
- హస్తంలో తారాస్థాయికి చేరిన వివాదాలు..
- చర్చనీయాంశంగా మారిన వ్యవహారం




మంచిర్యాల, ఏప్రిల్ 15 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్‌లో మంత్రి పదవి ‘కాక’ రేపుతున్నది. అధికార పార్టీ నుంచి నలుగురు ఎమ్మెల్యేలుండగా.. అందులో ముగ్గురు మంచిర్యాల జిల్లా నుంచే ప్రాతినిథ్యం వహించడం.. ఆ ముగ్గురూ మంత్రి పదవి రేసులో ఉండడం ‘హస్తం’లో చిచ్చురేపుతున్నది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి మంచిర్యాల జిల్లా ఎమ్మెల్యేలు ఎవరికి వారే మంత్రి పదవి తనకే వస్తుందంటూ చెప్పుకుంటూ వచ్చారు. రాష్ట్రంలోని పార్టీ పెద్దలు ఎవరికి వారు తమ అనుయాయులకే మంత్రి పదవి ఇవ్వాలంటూ మూడు జాబితాలను అధిష్ఠానానికి ఇచ్చినట్లు తెలిసింది. ఉగాది సందర్భంగా మంత్రివర్గ విస్తరణ ఉంటుందంటూ అనేక వార్తలు వచ్చాయి. చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్‌కు మంత్రి పదవి వస్తుందని.. లేదు.. మంచిర్యాల ఎమ్మెల్యే పీఎస్సార్‌కే మంత్రి పదవి ఖాయమైందని.. అసలు ఈ ఇద్దరికీ కాకుండా సీనియరైన బెల్లంపల్లి ఎమ్మెల్యే వివేక్‌కు పదవి వస్తుందంటూ చర్చ నడిసింది. ఎమ్మెల్యేల అనుచరులు సైతం మంత్రి కాబోయేది మా సారే అంటూ.. ఎవరికి వారు ధీమా వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో జిల్లా రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. మంత్రి పదవి విషయంలో రోజూ ఏదో ఒక చర్చ నడిచింది. ఈ క్రమంలోనే విస్తరణకు బ్రేక్ పడడంతో మంత్రి పదవి ఆశావాహులు ఎదురుచూడక తప్పని పరిస్థితి నెలకొంది. కానీ మంత్రి వర్గ విస్తరణకు బ్రేక్ పడడంతో..ఎవరికి వారు మంత్రి పదవి ప్రయత్నాలను ముమ్మరం చేశారు. దీంతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్‌లో వివాదాలు మరింత ముదిరిపోయాయి. అవి కాస్త ఇప్పుడు వ్యక్తిగత విమర్శల దాకా వెళ్లాయి. పదవి కోసం పట్టువిడిచేది లేదని మంచిర్యాలలో మంత్రుల సభ సాక్షిగా పీఎస్సార్ స్పష్టం చేయగా, అదే రోజు మిగిలిన ఇద్దరు ఎమ్మెల్యేలు కూడా ఎవరికి వారు తేల్చి చెప్పడం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

### మంత్రుల సమక్షంలోనే అసంతృప్తి..

మంత్రి పదవి రేసులో ఉన్న ఎమ్మెల్యే పీఎస్సార్ మంచిర్యాలలో సోమవారం నిర్వహించిన బహిరంగసభలో మంత్రులు భట్టి విక్రమార్క, శ్రీధర్‌బాబు సమక్షంలో అసంతృప్తి వెల్లగక్కారు. 20 ఏండ్లుగా పార్టీని పట్టుకొని ఉన్నానని, కష్టకాలంలో కూడా విడిచిపెట్టకుండా అధికారంలో వచ్చేందుకు కృషి చేశానని, ఇంద్రవెల్లి, మంచిర్యాల సభను విజయవంతం చేశానని.. ఇంత చేసినా నన్ను కాదని నిన్న.. మొన్న పార్టీలోకి వచ్చిన వారికి మంత్రి పదవి ఎలా ఇస్తారంటూ పీఎస్సార్ సభలోనే మాట్లాడారు. నాకు అన్యాయం చేస్తే సహించేది లేదంటూ స్పష్టం చేశారు. ఒక్క కుటుంబంలో ముగ్గురికి పదవి ఇచ్చారని.. ఇప్పుడు మంత్రి పదవి కూడా ఇస్తే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు అన్యాయం చేసినట్లే అవుతుందన్నారు. అదే జరిగితే ఉమ్మడి జిల్లాలో ‘తిరుగుబాటు’ తప్పదంటూ కుండబద్దలు కొట్టారు. దీనిపై వివేక్ సైతం స్పందించారు. బీజేపీలో ఉంటే కేంద్ర మంత్రి పదవి వచ్చేదని.. స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆహ్వానిస్తేనే తాను కాంగ్రెస్‌లో చేరానని చెప్పారు. పీఎస్సార్ వ్యాఖ్యలపై అసహనం వ్యక్తం చేశారు. పార్టీలు మారడం ముఖ్యం కాదని, ప్రజలకు ఎంత మంచిపని చేశామన్నదే ముఖ్యమంటూ మండిపడ్డారు. బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్ పీఎస్సార్ వ్యాఖ్యలపై స్పందించారు. కాక కుటుంబంలో ముగ్గురికి పదవులు ఇచ్చారని మాట్లాడం సరికాదన్నారు. పదేళ్లు పార్టీ కోసం పని చేసిన ఆయనే అలా మాట్లాడితే 70 ఏండ్లు కాంగ్రెస్ పార్టీ కోసమే కాక కుటుంబం పని చేస్తుందన్నారు. తాను మంత్రిగా ఉన్న సమయంలో పీఎస్సార్‌కు ఎమ్మెల్సీ టికెట్ ఇవ్వమని సిఫార్సు చేశామన్నారు. అవన్ని మర్చిపోయి మా కుటుంబం గురించి మాట్లాడడం సరికాదన్నారు. సీనియర్ ఎమ్మెల్యేగా తాను మంత్రి పదవి ఆశించడంలో తప్పేమీ లేదన్నారు. ఇలా ముగ్గురు నేతలు ఎవరికి వారు మంత్రి పదవిపై పట్టుబట్టిన నేపథ్యంలో మంత్రి పదవి ఎవరికి ఇచ్చినా జిల్లాలో కాంగ్రెస్ పార్టీ మూడుగా చీలిపోయే ప్రమాదం లేకపోలేదనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

### పథకం ప్రకారమే మీటింగ్..

మంత్రివర్గ విస్తరణలో రాష్ట్రనాయకత్వం సైత ఎవరికి వారే యమునా తీరేలా వ్యవహరిస్తున్నట్లు తెలిసింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ముగ్గురు అధిష్ఠానానికి మూడు నివేదికలు ఇచ్చినట్లు సమాచారం. ఎవరి అనుయాయుల పేర్లను వారు ప్రతిపాదించినట్లు తెలిసింది. మంత్రి పదవుల విషయంలో రాష్ట్రంలోని మంత్రులు సైతం మూడు వర్గాలుగా చీలిపోయారనే ప్రచారం నడుస్తున్నది. ఈ నేపథ్యంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు అత్యంత సన్నిహితుడిగా పేరు ఉన్న పీఎస్సార్‌కు మంత్రి పదవి కోసం ఆయన ప్రతిపాదించి ఉండవచ్చనే చర్చ పార్టీలో నడుస్తుంది. ఈ లోగా మంత్రివర్గ విస్తరణ వాయిదా పడడంతో వివేక్, వినోద్ సైతం రేసులోకి రావడంతో ఎత్తుగడంలో భాగంగానే మంత్రుల సభ నిర్వహించారనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. మొన్నటికి మొన్న కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సైతం నాకు బరాబర్ మంత్రి పదవి ఇవ్వాల్సిందేనంటూ ఓ మీటింగ్‌లో డిమాండ్ చేశారు. అదే తరహాలో మంచిర్యాలలో సభ జరగడం, మంచిర్యాల ఎమ్మెల్యే పీఎస్సార్ సైతం తనకు మంత్రి పదవి విషయంలో అన్యాయం చేస్తే సహించేది లేదంటూ చెప్పడం పథకం ప్రకారమే జరిగి ఉండవచ్చనే అభిప్రాయాలు వెల్లువెత్తుతున్నాయి. భట్టి విక్రమార్క తన మార్క్‌ను చూపించుకోవడంలో భాగంగానే తన అనుయాయుడికి పదవి కోసం పట్టుపడుతున్నట్లు తెలుస్తుంది. పక్క జిల్లా మంత్రి శ్రీధర్‌బాబు సైతం కాక కుటుంబంలో వారి కంటే పీఎస్సార్‌కు పదవి వస్తే స్థానికంగా తనకు ఎదరు ఉండదని భావిస్తున్నట్లు సమాచారం. అందులో భాగంగా ఇద్దరు మంత్రులు సపోర్ట్ చేస్తున్నారనే చర్చ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీలో నడుస్తుంది. మరో వైపు వివేక్ వెంటకస్వామికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సపోర్ట్ చేస్తున్నారు. పార్టీలో చేరే సమయంలో సీఎం, సునీల్ కనుగోలు మంత్రి పదవి హామీ ఇచ్చారంటూ నిన్న ప్రెస్‌మీట్‌లో బెల్లంపల్లి ఎమ్మెల్యే చెప్పకనే చెప్పారు. తాను సైతం సీనియర్‌గా పదవి కోరుకుంటున్నట్లు మనసులోని మాటను బయటపెట్టారు. వినోద్ గతంలో వైఎస్ఆర్ ప్రభుత్వంలోనే మంత్రిగా పని చేశారు. అధిష్ఠానంలో తనకున్న పరిచాలతో ఆయన కూడా గట్టిగానే ప్రయత్నాలు చేస్తున్నారు. కాక కుటుంబంలో ఎవరికి మంత్రి పదవి వచ్చినా పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గం మొత్తం ఆ ఎఫెక్ట్ ఉంటుంది. రాష్ట్ర రాజకీయాల్లో సైతం వారు కీలకంగా మారిపోతాయి. అదే జరిగితే తమకు ఇబ్బందులు తప్పవని కొందరు మంత్రులు భావిస్తున్నట్లు తెలిసింది. అదే పీఎస్సార్‌కు వస్తే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకే పరిమితం అవుతారు. రాష్ట్రంలో మన బృందంలో మరొకరు చేరి బలం పెంచుకోవచ్చనే ఆలోచనల్లో ఓ మంత్రుల వర్గం ఉన్నట్లు సమాచారం. అలా పట్టుభిగించడంలో భాగంగా వ్యూహాత్మకంగా మంచిర్యాలలో మంత్రుల సభ నిర్వహించారనే టాక్ నడుస్తున్నది. ఏదేమైనా జిల్లాలోని ముగ్గురు ఎమ్మెల్యేలు ఎవరికి వారు మంత్రి పదవి రేసులో ఉండడం.. ఆ పార్టీ కార్యకర్తలు, నాయకుల్లో గందరగోళం పెంచింది. మంత్రివర్గ విస్తరణ జరిగితే పార్టీ చీలిపోయే అవకాశాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. అదే జరిగితే కాంగ్రెస్‌కు తీవ్రనష్టం జరిగే అవకాశాలున్నాయనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. మరి దీన్ని పార్టీ పెద్దలు ఎలా ఫేస్ చేస్తారా అన్నది వేచి చాడాల్సి ఉంది.

# కార్మికుల హక్కులను కాలరాస్తారా?


## స్థానికులకో న్యాయం.. స్థానికేతరులకో న్యాయమా?

- ఆర్టికల్ - 14కు వ్యతిరేకంగా వ్యవహరించడం సరికాదు
- ప్రెసిడెన్షియల్ ఆర్డర్ తెచ్చి కంపెనీ తెరిపించిన ఘనత బీఆర్ఎస్‌దే
- ఆత్మీయ సమ్మేళనంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



పేపర్ మిల్లు కార్మికుల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

కాగజ్‌నగర్, ఏప్రిల్ 15 : సిర్పూర్ పేపర్ మిల్లు యాజమాన్యం కార్మికుల హక్కులను కాలరాస్తున్నదని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలం కోసినిలోని తన నివాసంలో పేపర్ మిల్లు కార్మికులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎస్పీఎంలో స్థానికులను ఓ రకంగా, స్థానికేతరులను మరో రకంగా చూస్తున్నారని, దేశమంతా ఒక న్యాయమైతే.. సిర్పూర్ నియోజకవర్గానికో న్యాయమా అంటూ ప్రశ్నించారు. ఎస్పీఎం యాజమాన్యం భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 సమానత్వపు హక్కుకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నదని ఆరోపించారు. ఉద్యోగుల క్వార్టర్స్‌కు కనీసం నీటి సరఫరా చేయడం లేదన్నారు. సెలవులు తగ్గించారని, ఫింఛన్లు ఇవ్వడం లేదని, ఇంక్రిమెంట్లు అమలు చేయడం లేదని, పంచ్ కూడా పని చేసే చోట పెట్టలేదని మండిపడ్డారు. బీజేపీ ఎమ్మెల్యే కంపెనీ క్వార్టర్స్‌లో పార్టీ ఆఫీస్ పెట్టి నడుపుతున్నారని, ఆయన కార్మికుల తరుపున మాట్లాడే ధైర్యం చేయడం లేదన్నారు. మాజీ ఎమ్మెల్యే కోనప్ప తన కాంట్రాక్టులు, కమీషన్ల కోసం యాజమాన్యంతో కుమ్మక్కై కార్మికుల సంక్షేమాన్ని మరిచారన్నారు. తనకు లారీలు లేవని, కర్ర, నీరు, పేపర్లలో తనకు వాటాగానీ.. కాంట్రాక్టుగానీ అవసరం లేదని, కేవలం కార్మికుల సంతోషమే ముఖ్యమన్నారు. కంపెనీ బాగుండాలి.. కార్మికులు కూడా బాగుండాలని కోరారు. ప్రెసిడెన్షియల్ ఆర్డర్ తెచ్చి కంపెనీని తెరిపించిన ఘనత బీఆర్ఎస్‌దేనని కొనియాడారు. 95 శాతం స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వాలనే ఒప్పందంతో పేపర్ మిల్లు పున:ప్రారంభమైందని, కానీ, ప్రస్తుతం 60 శాతం కూడా స్థానికులు లేరన్నారు. స్థానికులకు పని రాదని, సోమరులని యాజమాన్యం అవమానపరుస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికుల అభివృద్ధి కోసం ఎంతటి త్యాగానికైనా సిద్ధమేనని పేర్కొన్నారు. కాంగ్రెస్‌కు ఓటేసి ప్రజలంతా బాధపడుతున్నారని, కాంగ్రెస్ పాలనలో సంతోషంగా లేరని, ప్రభుత్వం ఇచ్చిన ఏ హామీ కూడా నెరవేర్చలేదని, అలాగే మిల్లు యాజమాన్యం కార్మికుల భవిష్యత్ కోసం ఆలోచించి నిర్ణయం తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నియోజకవర్గ కన్వీనర్ లెండుగురె శ్యాంరావు, బీఆర్ఎస్ నాయకులు రాజ్‌కుమార్, అంబాల ఓదెలు, మోయిన్, కన్నయ్య, నాగులయ్య, తన్నీరు పోషం, మిల్లు కార్మికులు పాల్గొన్నారు.



మందమర్రిలోని 12వ వార్డులో వాల్ పోస్టర్లతో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

# జోరుగా రజతోత్సవ సభ ప్రచారం

మందమర్రి, ఏప్రిల్ 15 : బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో ఈ నెల 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించే రజతోత్సవ సభను విజయవంతం చేయాలని కోరుతూ పార్టీ శ్రేణులు మంగళవారం మందమర్రిలో జోరుగా ప్రచారం నిర్వహించారు. వార్డుల వారీగా వాల్ రైటింగ్ చేయిస్తూ, పోస్టర్లు వేస్తూ ఇంటింటి ప్రచారం చేశారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అలవికాని హామీలతో ప్రజలను వంచించిందని ఆరోపించారు. కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టేందుకు బీఆర్ఎస్ రజతోత్సవ సభ నిర్వహిస్తున్నదన్నారు. సభకు తరలి వెళ్లేందుకు మున్సిపాలిటీకి 12 బస్సులను కేటాయించడంతో పాటు అన్ని వసతులు కల్పిస్తున్నట్లు వారు చెప్పారు. బీఆర్ఎస్ అనుబంధ సంఘాల నాయకులు మద్ది శంకర్, పల్లె నర్సింగ్, ఓదెలు, కిరణ్, రవీందర్, భట్టు రాజ్‌కుమార్, తోట సురేందర్, ఎండీ ముస్తఫా, బెల్లం అశోక్, సీపెల్లి సాగర్, కళ్లోజీ అనిల్‌కుమార్, కట్ల మోహన్, కుడికాల కల్పన, యశ్వంత్, కుడికాల శ్రీనివాస్, స్వాతి, సుశీల, కవిత, రాజేశ్వరి, రోజా, అభిషేక్, విశాల్, శ్రీనాథ్ పాల్గొన్నారు.

# షట్‌పల్లిలో బోరుబావి పనులు షురూ..

## ‘నమస్తే తెలంగాణ’ కథనానికి స్పందన



నమస్తే తెలంగాణలో ప్రచురించిన కథనం



షట్‌పల్లి ఎస్సీ కాలనీలో బోరు వేయిస్తున్న స్థానిక నాయకులు

కోటపల్లి, ఏప్రిల్ 15 : షట్‌పల్లి గ్రామంలోని ఎస్సీ కాలనీవాసులు తాగు నీటికి తీవ్ర ఇబ్బందులు పడుతుండగా, గత నెల 17న ‘నమస్తే తెలంగాణ’లో దాహం తీరేదెట్లా’ శీర్షికన కథనం ప్రచురితమైంది. ఈ విషయాన్ని ఇటీవల ఎమ్మెల్యే వివేక్ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన స్పందించారు. ఎస్సీ కాలనీలో బోరుబావి ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించగా, మంగళవారం పనులను ప్రారంభించారు. తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేసిన ‘నమస్తే తెలంగాణ’కు ఎస్సీ కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు.

# సీనియర్ మహిళల హ్యాండ్ బాల్ జట్టు ఎంపిక



ఉమ్మడి జిల్లా జట్టుతో హ్యాండ్ బాల్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కనపర్తి రమేశ్ తదితరులు

ఆసిఫాబాద్ టౌన్, ఏప్రిల్ 15 : జిల్లా కేంద్రంలోని గిరిజన ఆదర్శ బాలికల క్రీడా పాఠశాలలో మంగళవారం 54వ సీనియర్ మహిళల హ్యాండ్ బాల్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జట్టు ఎంపిక పోటీలు నిర్వహించామని హ్యాండ్ బాల్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కనపర్తి రమేశ్ పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ మొత్తం 80 మంది క్రీడాకారులు హాజరయ్యారని, ఇందులో నైపుణ్యం కలిగిన 20 మందిని ఎంపిక చేశామన్నారు. ఎంపికైన జట్టుకు ఈ నెల 18వ తేదీ నుంచి కోచింగ్ నిర్వహిస్తామన్నారు. ఈ నెల 28,29, 30 తేదీల్లో మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణంలో నిర్వహించనున్న 54వ తెలంగాణ రాష్ట్రస్థాయి సీనియర్ మహిళల హ్యాండ్ బాల్ చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ పాఠశాలల జిల్లా క్రీడాధికారి మీనారెడ్డి, క్రీడా పాఠశాల హెడ్ మాస్టర్ జంగు, సీసీఎంవో ఉద్ధవ్, కోచ్‌లు అరవింద్, రవి, రాకేశ్, సాయి, సంజీవ్, సాగర్ సీనియర్ క్రీడకారుడు సంజయ్ పాల్గొన్నారు.

# నాడు తల్లి.. నేడు తండ్రి..

- రెండేళ్లక్రితం అనారోగ్యంతో కన్నుమూసిన తల్లి
- నేడు వడదెబ్బ తో తండ్రి మృత్యువాత
- అనాథలైన ఇద్దరు పిల్లలు
- ప్రభుత్వం ఆదుకోవాలంటున్న గ్రామస్తులు



హన్మంతు(ఫైల్)



అనాథలైన పిల్లలు

సిర్పూర్(యూ), ఏప్రిల్ 15 : నాడు అనారోగ్యంతో తల్లి కన్నుమూయగా, నేడు వడదెబ్బతో తండ్రి మృతి చెందడంతో ఆ ఇద్దరు పిల్లలు అనాథలయ్యారు. ఈ హృదయవిదారకర ఘటన కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(యు) మండలం రాఘపూర్‌లో జరిగింది. కుటుంబ సభ్యులు, స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన సోయం హన్మంతు (27) శనివారం ఉపాధి పనికి పోయాడు. ఎండ తీవ్రతకు తీవ్ర అస్వస్థతతకు గురయ్యాడు. ఈ క్రమంలో ఆదివారం, సోమవారం జ్వరం రాగా, ఇంట్లోనే ఉన్నాడు. మంగళవారం ఉదయం పరిస్థితి విషమించి మృతి చెందాడు. కాగా, ఇతని భార్య సోయం లక్ష్మి కూడా రెండేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. వీరికి పాప జంగుబాయి, కుమారుడు చంద్రబాన్ ఉన్నారు. జంగుబాయి జైనూర్ మండలం పానపటార్‌లోని ఆశ్రమ పాఠశాలలో ఐదో తరగతి, చంద్రబాన్ పోచంలొద్ది ఆశ్రమ పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్నాడు. తండ్రి మృతదేహంపై పడి వీరిద్దరూ కన్నీరు పెట్టుకోవడం అక్కడున్న వారిని కలచివేసింది. దిక్కులేని వారైన ఇద్దరి పిల్లలను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని మాజీ సర్పంచు కోవ నాందేవ్, గ్రామ పెద్దలు కోరుతున్నారు.